# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 13-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో ఆతిధ్య రంగంలో పెట్టుబడులకు పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా, ఆరోగ్య భద్రత అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో క్రీడల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కేంద్రాన్ని కోరారు.**

4. **రాష్ట్రంలో ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ఆతిధ్య రంగంలో పెట్టుబడులకు పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పర్యాటక రంగంలో పెట్టుబడులపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చారిత్రాత్మక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించేలా జిల్లాల వారీగా చర్యలు తీసుకోవాలన్నారు. పాపికొండలు, గండికోట , సూర్యలంక వంటి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ఆరోగ్యకరమైన చిరుధాన్యాల ఆహారాన్ని మరింత ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గిరిజన సంప్రదాయ వంటకాలను 'అరకు కౌని' పేరుతో రూపొందించిన తొలి సేంద్రియ చిరుధాన్యాల ఆహార మెనూను రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. గిరిజనులు పండించిన కొర్రలు, రాగులు, సామలు, జొన్నలు, మొక్కజొన్న, కొండ కందులుతో తయారు చేసిన వివిధ ఆహార పదార్థాలను పరిశీలించి, వాటితో తయారు చేసిన వంటకాలను ముఖ్యమంత్రి రుచి చూశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో 'అరకు కౌని' వంటకాలను మెనూలో చేర్చడం ద్వారా గిరిజన మిల్లెట్ ఆహారాన్ని ప్రోత్సహించాలని చెప్పారు.

---

తెలంగాణలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా, ఆరోగ్య భద్రత అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ కోకాపేటలో కొత్తగా నిర్మించిన ఆసుపత్రిని మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 65 లక్షల మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. పేదలకు సరైన విద్య, వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 26 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లో క్రీడల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఢిల్లీలో కేంద్ర క్రీడా శాఖ మన్‌సుఖ్ మాండవీయను అమలాపురం పార్లమెంట్ సభ్యులు G. M. హరీష్ బాలయోగి, శాప్ చైర్మన్ ఏ.రవి నాయుడుతో కలిసి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రీడా అభివృద్ధిపై చర్చించారు. ఖేలో ఇండియా కింద అమలాపురం, ఏలూరు, తిరుపతి, విశాఖపట్నం, కుప్పం, కర్నూలు, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాల్లో క్రీడా వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విలువిద్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పారా క్రీడా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి మనసుఖ్ మాండవీయ సానుకూలంగా స్పందించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

---

విద్యా వ్యవస్థలో కాలానుగుణంగా మార్పులు అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా విద్యాశాఖ, నైపుణ్యాభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత అవసరాలు, అభివృద్ధికి అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇందుకోసం వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలను సంప్రదించి అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

---

ఆంధ్రప్రదేశ్ లో ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, రుణాల విషయంలో ప్రభుత్వం నెట్ బారోయింగ్‌ను ఎక్కడ అధిగమించలేదన్నారు. ధరల నియంత్రణ కమిటీ ద్వారా మార్కెట్‌లో అసాధారణ ధరల పెరుగుదలను నిరోధించడానికి చర్యలు చేపట్టామని పయ్యావుల కేశవ్ పేర్కొంటూ,

వాయిస్ 33 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం పోర్ట్ అథారిటీ రికార్డు స్థాయిలో సరకు రవాణా చేసిందని పోర్టు అథారిటీ ఛైర్మన్ అంగముత్తు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 85.07 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేసిందని విశాఖ పోర్టు చరిత్రలో ఇదే అత్యధిక సరకు రవాణాగా నమోదైందని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 90 మిలియన్ మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు. అలాగే రానున్న 2026--27 ఆర్థిక సంవత్సరంలో 100 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు నిర్వహణ లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధనకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం – దోహదం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పరిశ్రమలు, ఐటీశాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై హైదరాబాద్ లో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ..పీపీపీ విధానానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడానికి, స్థానిక వనరుల ద్వారా ఉపాధి కల్పనకు రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీకి ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆంధ్రప్రదేశ్ పత్రికా విలేకరులకు అవగాహన కల్పించేందుకు పత్రికా సమాచార కార్యాలయం – పీఐబీ నిర్వహిస్తున్న అవగాహన పర్యటన మధ్యప్రదేశ్‌లో కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ పీఐబీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ చంద్ర ఆధ్వర్యంలో వివిధ పత్రికా, ఎలక్ట్రానిక్ రంగాలకు చెందిన సీనియర్ పాత్రికేయులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా భోపాల్‌లోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కార్యాలయాన్ని నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ చంద్ర మాట్లాడుతూ, ఈ పర్యటనల ద్వారా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విలేకరులకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని దిగువ ట్రోపో ఆవరణము వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో పొడి వాతావరణం కొనసాగుతుందని రానున్న 3 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశముందని తెలిపింది.

తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో పొడివాతావరణం కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది

=====================